క్లుప్తంగా

వేదగిరిలో విశేష పూజలు



నెల్లూరు రూరల్: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో విశేష పూజలు, అభిషేకాలను శనివారం నిర్వహించారు. తిరుప్పావైసేవ, గిరిప్రదక్షిణ చేశారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆందోళన



నెల్లూరు (అర్బన్): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రిటైర్డ్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి నేతలు కోరారు. ఈ మేరకు గాంధీబొమ్మ వద్ద పోస్టర్లను పలువురు ఉద్యోగులు శనివారం ఆవిష్కరించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ఆందోళనను చేపట్టారు. సంఘ జిల్లా చైర్మన్ పెంచలరెడ్డి, నేతలు వెంకటర మణయ్య, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఓ హోటల్లో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పర్యవేక్షకులుగా సుధీర్‌బాబు, లక్ష్మణ్‌దేవ్, విజయ్‌కుమార్, విశ్వనాథ్ వ్యవహరించారు. అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటేశ్వరరావు, కృష్ణారెడ్డి, ట్రెజరర్‌గా నాగరాజరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రాధాకృష్ణారెడ్డి, రవికుమార్, విజయ్‌కుమార్, నిర్వహణ కార్యదర్శిగా నాగమణి, సంయుక్త కార్యదర్శులుగా శ్రీకాంత్, వెంకటేశ్వరరావు, ఈసీ మెంబర్లుగా సుధీర్‌కుమార్, వెంకటేష్‌ను ఎన్నుకున్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు ఏకాంతసేవతో ముగిశాయి. ధ్వజావరోహణ, పూర్ణాహుతి, వసంతోత్సవాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా శ్రీనివాసరావు, వెంకటసుభాషిణి, వెంకటేశ్వర్లు, సుధామణి దంపతులు వ్యవహరించారు.

కనులపండువగా శ్రీరామపట్టాభిషేకం

నెల్లూరు(బృందావనం): బారకాస్‌లోని శ్రీరామ మందిరంలో శ్రీరామపట్టాభిషేకాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉభయకర్తలుగా భవానీశంకర్, భాగ్యలక్ష్మి దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్షుడు శేషయ్య, సభ్యులు హనుమంతరావు, సత్యనారాయణ పర్యవేక్షించారు.

వేడుకగా ఏకాంతసేవ



నెల్లూరు(బృందావనం): నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో నిర్వహిస్తున్న కోదండరామస్వామి, ప్రసన్నాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి ఏకాంతసేవ, పల్లకిసేవను జరిపారు. ఉభయకర్తలుగా దయాకర్‌గౌడ్, సుబ్బరత్నమ్మ వ్యవహరించారు. రామాంజనేయ యుద్ధం – గయోపాఖ్యాన నాటక ప్రదర్శనలను లక్ష్మీచెన్నకేశవ నాట్యమండలి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రదర్శించారు.

అశ్వవాహనంపై వేణుగోపాలుడు



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా అశ్వవాహనంపై స్వామివారు శనివారం దర్శనమిచ్చారు. వెణ్ణత్తాళి ఉత్సవాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా గిరిప్రసాద్, వాణి, మాలకొండారెడ్డి వ్యవహరించారు. ఈఓ చంద్రశేఖర్‌రావు, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ చంద్రమౌళీరెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో అన్నివర్గాలకు మేలు



మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు : వైఎస్సార్‌సీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా మేలు జరుగుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చింతోపు గ్రామంలో మంత్రి కాకాణి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం చేపట్టారు. తొలుత స్థానిక నేత లేబూరు మల్లికార్జున్ ఆధ్వర్యంలో మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. రైతుభరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్, ఫ్యామిలీ డాక్టర్ వంటి బృహత్తర కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నట్లు వెల్లడించారు.

పేదలకు స్థలాలు ఇవ్వకూడదనే కోర్టుకెళ్లారు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇళ్ల స్థలాల పంపిణీకి సంబంధించి చింతోపులో పేదలకు స్థలాలు అందకుండా చేయాలని టీడీపీ నేతలు కోర్టులో కేసులు వేశారని మంత్రి కాకాణి మండిపడ్డారు. అయినప్పటికీ ఆ కేసులను అధిగమించి త్వరలోనే పేదలందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. గడిచిన నాలుగేళ్లలో చింతోపు పంచాయతీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశామని, అసంపూర్తిగా ఉన్న కొన్ని సీసీరోడ్ల నిర్మాణాలను సంబంధించి ఇప్పటికే నిధులు మంజూరు చేశామని వివరించారు. ఈ క్రమంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్మశానవాటికను మంత్రి కాకాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, నేతలు లేబూరు మల్లికార్జున్, జగన్నాటి వీరరాఘవయ్య, తలమంచి సురేంద్రబాబు, మన్నెం సుబ్రహ్మణ్యం, మన్నెం చిరంజీవులగౌడ్, ఆకుల మధు, వెడిచర్ల శ్రీనివాసులుగౌడ్, దుంపల ఏసోబు, ఎంబేటి సంధ్యారాణి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. సీతారాముల కల్యాణం

మనుబోలు : శ్రీరామ నవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణాన్ని మనుబోలు తూర్పువీధి, కోదండరామపురం రామాలయాల్లో శుక్రవారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. తూర్పువీధిలో అర్చకుడు కుమారస్వామి, కోదండరామపురంలో హరికృష్ణశర్మ, శశికుమార్‌శర్మ సీతారాములకు అభిషేకాలు జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. వేదమంత్రోచ్చారణల నడుమ ముత్యాల తలంబ్రాలతో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కోదండరామపురం ఆలయంలో మడమనూరుకు చెందిన కందల సుశ్మిత చేసిన భరతనాట్యం భక్తులను ఆకట్టుకుంది. కేఆర్‌పురంలో దువ్వూరు సుధాకర్‌రెడ్డి–రాజేశ్వరమ్మ దంపతులు, తూర్పువీధిలో మారంరెడ్డి రమణారెడ్డి–సరసమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.



మనుబోలు : తూర్పువీధిలో వేడుకగా జరుగుతున్న కల్యాణం

రక్తహీనత నివారణకు చర్యలు

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

మనుబోలు : గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ పెంచలయ్య తెలిపారు. మండలంలోని పిడూరు, ఎల్ఎన్‌పురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీ రికార్డులతో సరిపోల్చి అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతల నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల రక్తహీనతను గుర్తించి ఆరు నెలల పాటు ఐరన్ మాత్రలు వాడేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం తరువాత గర్భిణుల చేత ఐరన్ మాత్రలు మింగించాలని సూచించారు. అనంతరం పదో తరగతి పరీక్షల నేపథ్యంలో మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు అన్ని పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాజు, సీహెచ్‌ఓ రాజయ్య ఉన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

వెంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న శ్రీలక్ష్మి గోద వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామికి అభిషేకాలు, సాయంత్రం పూజలు, పల్లకి సేవ చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సాహితీ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



ఆహ్వాన పత్రికను చూపుతున్న హెచ్‌ఎం

కొడవలూరు : శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 9, 10వ తేదీల్లో నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు మండలంలోని వెంకన్నపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం టి.వెంకటేశ్వర్లుకు ఆహ్వానం లభించింది. తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహించే సాహితీ బ్రహ్మోత్సవాల్లో కవితాగానం, సాహిత్య సదస్సుల్లో హెచ్‌ఎం పాల్గొననున్నారు.

ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపిన ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం : నియోజకవర్గంలోని క్రిస్టియన్లకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ఈస్టర్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిఒక్కరూ క్రీస్తును ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన మార్గాలు అనుసరణీయమని వెల్లడించారు.

మరింత మెరుగ్గా వైద్య సేవలు



పొదలకూరు సీహెచ్‌సీ భవనం

- అదనపు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు
- పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్ల నియామకం
- తాత్కాలికంగా సీహెచ్‌సీలోనే పీహెచ్‌సీ ఏర్పాటు

పొదలకూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించాలని కృషి చేస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నిరుపేదలకు ప్రాథమిక వైద్యం అందించి వారిని ఆదుకోవాలని ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలోనే వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో మండలానికి అదనంగా మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(కో–లొకేటెడ్) మంజూరైంది. ఇప్పటికే చాలా ఏళ్లుగా మండలంలోని మహ్మదాపురంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. పొదలకూరులో సీహెచ్‌సీ(సామాజిక ఆరోగ్య కేంద్రం) ఏర్పడక ముందు మండలంలో రెండు పీహెచ్‌సీలు ఉండేవి. సీహెచ్‌సీ ఏర్పడిన తర్వాత అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలను మహ్మదాపురం పీహెచ్‌సీ కిందకు తీసుకొచ్చారు. అయితే మండల జనాభా 68 వేలకు పైగా ఉండడమే కాకుండా జిల్లాలోనే పెద్ద మండలం కావడం వల్ల అదనపు పీహెచ్‌సీ అవసరమని గుర్తించిన మంత్రి కాకాణి ఆ మేరకు మంజూరయ్యేందుకు కృషి చేశారు.

పీహెచ్‌సీ పరిధిలో ఏడు సబ్‌సెంటర్లు

అదనపు పీహెచ్‌సీ పరిధిలో మండలంలోని ఏడు సబ్‌సెంటర్లను కలిపారు. ఫలితంగా పాలనా సౌలభ్యంతో పాటు పేదలకు ప్రాథమిక వైద్యం అందించడంతో పాటు, గర్భిణులు, పిల్లలకు పీహెచ్‌సీల్లో టీకాలు వేయడం మరింత సులువుగా ఉంటుంది. మండలంలో మొత్తం 13 వైద్య ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. వాటిలో తాటిపర్తి, మహ్మదాపురం, విరువూరు, నావూరు, అమ్మవారిపాళెం, ప్రభగిరిపట్నం, పొదలకూరు, లింగంపల్లి, బిరదవోలు, దుగ్గుంటరాజుపాళెం, మొగళ్లూరు, అల్లూర్తి, మరుపూరు ఉన్నాయి. ఇప్పటి వరకు 13 సబ్‌సెంటర్లు మహ్మదాపురం పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తుండగా ఇకపై అదనపు పీహెచ్‌సీ కిందకు లింగంపల్లి, పొదలకూరు, దుగ్గుంటరాజుపాళెం, మొగళ్లూరు, అల్లూర్తి, మరుపూరు, బిరదవోలు సబ్‌సెంటర్లు వస్తాయి. తాత్కాలికంగా పీహెచ్‌సీను పొదలకూరు సీహెచ్‌సీలో నిర్వహిస్తున్నారు. ఇందుకోసం శ్రీకావ్య, కిరణ్‌రిషిత మహిళా డాక్టర్లను నియమించారు. త్వరలో పీహెచ్‌సీకు పక్కా భవనాన్ని నిర్మించి అక్కడకు తరలించే అవకాశం ఉంది. పీహెచ్‌సీను ఎక్కడ ఏర్పాటు చేసేది ఉన్నతస్థాయి అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఇలా వచ్చారు.. అలా వెళ్లారు

అదనపు పీహెచ్‌సీ డాక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీకావ్యను వెంటనే డిప్యుటేషన్‌పై ఇస్కాపాళెం పీహెచ్‌సీలో నియమించారు. ఇక్కడ వైద్యురాలి అవసరం ఉన్నా అధికారులు ఎందుకు డిప్యుటేషన్‌పై తరలించారో తెలియడం లేదు. ఇస్కాపాళెం పీహెచ్‌సీ పరిధిలో తొమ్మిది సచివాలయాలు ఉండగా పొదలకూరు పీహెచ్‌సీ పరిధిలో 14 సచివాలయాలు ఉన్నాయి.

నాణ్యమైన సేవలు అందుతాయి



అదనపు పీహెచ్‌సీ ఏర్పాటు వల్ల పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందుతాయి. మంత్రి కాకాణి కృషి వల్లే అదనపు పీహెచ్‌సీ మండలానికి మంజూరైంది. తాత్కాలికంగా పొదలకూరు సీహెచ్‌సీలో పీహెచ్‌సీను నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో అందరికీ ఆమోదయోగ్యమైన గ్రామంలో పీహెచ్‌సీని ఏర్పాటు చేస్తారు.

– డాక్టర్ ఎం.రమేష్, మండల వైద్యాధికారి, మహ్మదాపురం.

గడప గడపలో విశేషాదరణ



మహిళలకు నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

- ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో ప్రజాప్రతినిధులకు విశేషాదరణ లభిస్తోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కొత్తూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 53 సచివాలయాల పరిధిలో 61,125 గడపలు తిరిగినట్లు వెల్లడించారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేసి జగనన్న పాలనపై ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు.

కోల్డ్ స్టోరేజీ ప్రారంభం

జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా మంజూరైన వాకిన్ కోల్డ్ స్టోరేజీ రూమ్‌ను స్థానిక పశు వైద్యశాలలో ఎమ్మెల్యే ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే గో పూజ నిర్వహించారు. రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, ఇందుకూరుపేట కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీఎల్‌డీఏ ఈఓ టి.సోమయ్య, డీడీ సురేష్, ఏడీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

స్త్రీనిధి ద్వారా రూ.74 లక్షలు

కొత్తూరు పంచాయతీ పరిధిలో స్త్రీనిధి ద్వారా 28 స్వయం సహాయక సంఘాలకు రూ.74 లక్షల రుణాల నమూనా చెక్కును ఎమ్మెల్యే మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం రవిశంకర్‌రెడ్డి, నేతలు లేబూరు వెంకురెడ్డి, ఈదూరు విజయ్‌భాస్కర్, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, బాబయ్య, తిరుమలరావు, వెంకటరమణయ్య, పి.జనార్దన్‌రెడ్డి, కె.రవి పాల్గొన్నారు.

మైపాడు రోడ్డుకు మహర్దశ

నెల్లూరు, మైపాడు రోడ్డుకు మహర్దశ పట్టనుందని ఎమ్మెల్యే ప్రసన్న తెలిపారు. మండలంలోని కొత్తూరులో ఆయన మాట్లాడారు. ఈ రోడ్డు ఏర్పాటుతో మండలం మరింత అభివృద్ధి బాటలో పయనిస్తుందని వెల్లడించారు. రోడ్డు విస్తరణకు సంబంధించి నిధుల మంజూరుకు సహకరించిన ప్రతిఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ రోడ్డు కోసం పార్టీ నేత దువ్వూరు కల్యాణ్‌కుమార్‌రెడ్డి కూడా ఎంతో కృషి చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నేతలు బట్టేపాటి నరేంద్రరెడ్డి, వెంకటశేషయ్య, శ్రీనివాసులురెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, షబ్బీర్, బీవీ రమణయ్య పాల్గొన్నారు.

రేషన్‌షాపులో తనిఖీలు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని పొలినాయుడు చెరువు గ్రామంలో ఉన్న 36వ రేషన్ దుకాణాన్ని సివిల్ సప్లైయ్స్, విజిలెన్స్ అధికారులు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సివిల్ సప్లైయ్స్ డీటీ మురళీ మాట్లాడుతూ ఇక్కడ అవకతవకలు జరుగుతున్నట్లు స్థానికులు తమకు ఫిర్యాదు చేయగా తాము విజిలెన్స్ ఏఈ సుధాకర్‌రెడ్డి సహకారంతో తనిఖీ చేశామన్నారు. దుకాణంలో 3,974 కిలోల బియ్యం, ఆరు కేజీల కందిపప్పు తక్కువగా ఉన్నట్లు గుర్తించగా, 350 చక్కెర ప్యాకెట్లు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. దీంతో దుకాణ యజమానిపై కేసు నమోదు చేశామన్నారు.



రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్, సివిల్ సప్లైయ్స్ అధికారులు

ఎమ్మెల్యే ప్రసన్న దాతృత్వం

- రూ.40 వేలు అందజేత

ఇందుకూరుపేట : కొత్తూరు గ్రామానికి చెందిన ఇరగరాజు నాగమణి, పద్మావతి అనే ఇద్దరు చిన్నారులకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి రూ.40 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అక్కా చెల్లెలు అయిన ఇద్దరు పిల్లలకు తల్లిదండ్రులు లేకపోవడంతో స్పందించిన ఎమ్మెల్యే ప్రసన్న వారి పేర్ల మీద నగదును బ్యాంకులో డిపాజిట్ చేయించి బాండ్లను వారి సంరక్షకులకు శనివారం అందజేశారు.



చిన్నారులకు బాండ్లను అందజేస్తున్న ప్రసన్న

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి



ముత్తుకూరు : మాట్లాడుతున్న సచివాలయ కన్వీనర్ శివప్రసాద్



వెంకటాచలంలో కరపత్రాలు అందజేస్తున్న వెంకటశేషయ్య



కోవూరు : పోతిరెడ్డిపాళెం గ్రామంలో..

- ముమ్మరంగా 'జగనన్నే మా భవిష్యత్తు'

ముత్తుకూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే రాబోయే ఎన్నికల్లో విజయం చేకూరుస్తాయని సచివాలయాల మండల కన్వీనర్ నెల్లూరు శివప్రసాద్ అన్నారు. ముత్తుకూరులో శనివారం నిర్వహించిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. ఈ నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రతి కుటుంబానికి తెలియచెప్పాలని వలంటీర్లు, గృహ సారథులకు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ వైఫల్యాలను కూడా సహనంతో వివరించాలన్నారు. ఎంపీపీ గండవరం సుగుణ, సర్పంచ్ బూదూరు లక్ష్మి, నాయకులు కె.లక్ష్మణరెడ్డి, నడవడి ముత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోలంరాజుగుంటలో..

పోలంరాజుగుంటలో జరిగిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో సర్పంచ్ దువ్వూరు హారికారెడ్డి పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను సమగ్రంగా వివరించాలని వలంటీర్లు, గృహసారథులకు తెలిపారు.

ప్రజల గుండెల్లో చెరగని ముద్ర

మనుబోలు : అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని వైఎస్సార్‌సీపీ నేతలు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్ అన్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా మనుబోలు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం సచివాలయ కన్వీనర్‌లు, వలంటీర్లు, గృహ సారథులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. గృహస్తుల అనుమతితో ఇంటికి, ఫోన్‌కు సీఎం స్టిక్కర్‌ను అంటించారు. గత ప్రభుత్వానికి ఇప్పటి ప్రభుత్వానికి ఉన్న తేడాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు బొమ్మిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, దువ్వూరు సుధాకర్‌రెడ్డి, గుంజి రమేష్, సచివాలయ కన్వీనర్ నాగమణి, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వెంకటాచలం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జి మందల వెంకటశేషయ్య అన్నారు. వెంకటాచలంలో శనివారం సాయంత్రం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో పేదలు పడిన ఇబ్బందులను వివరించి, జగనన్న పాలనలో జరిగిన మేలును అర్థమయ్యేలా వివరించారు. జగనన్న పాలనపై విశ్వాసం ఉందని చెప్పిన వారి ఇళ్లకు, సెల్‌ఫోన్‌కు స్టిక్కర్లు అంటించారు.

చవటపాళెంలో..

చవటపాళెం పంచాయతీలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, స్థానిక నేతలు కలిసి సమన్వయంతో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఇంటింటికి తిరిగారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు.

అపూర్వ స్పందన

పొదలకూరు : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి గ్రామస్తుల నుంచి అపూర్వ స్పందన లభిస్తున్నట్లు వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మరుపూరు గ్రామంలో వైస్ ఎంపీపీ ఆధ్వర్యంలో శనివారం గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి స్టిక్కర్లను అంటించుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగయ్య, సచివాలయ కన్వీనర్లు ప్రసాద్, కుమారి పాల్గొన్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ ఆధ్వర్యంలో నాలుగో వార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద ప్రజలు తమను ఆప్యాయంగా ఆహ్వానిస్తున్నారని, ప్రతిఒక్కరూ తమ ఇంటికి స్టిక్కర్ అంటించాలని కోరుతున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, నేతలు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, మోర్ల మురళీ, విల్సన్, ప్రవల్లిక, కోడూరు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. చెల్లాయపాళెంలో జరిగిన కార్యక్రమంలో రజనీకాంత్, మురళీ, మునులపూడిలో సర్పంచ్ వెంకటరమణారెడ్డి, వవ్వేరులో వైస్ చైర్‌పర్సన్ కాటంరెడ్డి లలితారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అపారమైన విశ్వాసం

కోవూరు : వైఎస్సార్‌సీపీ పాలనపై ప్రజల్లో అపారమైన విశ్వాసం వ్యక్తమవుతోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ కవరగిరి ప్రసాద్ అన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా పోతిరెడ్డిపాళెంలో ఆయన మాట్లాడుతూ ఏ ఇంటికి వెళ్లినా తామంతా జగనన్నకే మద్దతు పలుకుతామని, గత ప్రభుత్వం కంటే భిన్నంగా వైఎస్సార్‌సీపీ పాలనలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వస్తున్నాయని మహిళలు ఆనందంగా చెబుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేతలు గాజుల మల్లికార్జున, అల్లం రాజా, శ్రీనివాసులు, సాయి, సుధా పాల్గొన్నారు.



మనుబోలు మండల కేంద్రంలో..



పొదలకూరు : మరుపూరులో..



బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని నాలుగో వార్డులో..